# అడ్మిషన్ల పర్వం

గవర్నమెంటు కాలేజీలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. సూపర్నెంటునూ, ఇద్దరు సీనియర్ లెక్చరర్లనూ పక్కన పెట్టుకుని ప్రిన్సిపాల్ అడ్మిషన్లు జరుపుతున్నాడు. గది బయట చాలా రష్‌గా ఉంది. గది గుమ్మంలో ప్యూను నారదుడు నుంచుని, లోపల్నుంచి సూపర్నెంటు పిలిచిన పేరును తను మళ్ళీ బయటికి పిలుస్తున్నాడు. ఒక కుర్రాడు లోపల కొచ్చాడు. ప్రిన్సిపాల్ వాణ్ణి అడిగాడు : "నీ పేరేంటి?" ధీమాగా చెప్పాడు కుర్రాడు : "ఎస్ వీరుడు... సర్వజయం వీరుడు!"..... ప్రిన్సిపాల్ ఓ మాటు కుర్రాడివైపు నిశితంగా చూశాడు. అన్నాడు : "నీ తండ్రేడీ?".... "పొద్దున్న మిమ్మల్ని కలిసి మళ్ళీ రాలేనని చెప్పాడు గద్సార్"... "ఓఁ, అవునవును, సర్లే!" ప్రిన్సిపాల్ అప్లికేషను మీద 'అడ్మిట్' అని రాశాడు. సంతకం పెట్టబోతూ చూసి గతుక్కుమన్నాడు. "ఇక్కడ నీ సంతకమూ, నీ తండ్రి సంతకమూ లేవు. అవ్వి లేందే అడ్మిట్ చేసుకోను "

కుర్రాడు అప్లికేషను ప్రిన్సిపాల్ దగ్గర్నుంచి తీసుకొని తన సంతకం పెట్టేశాడు. "మానాన్న ఎల్లుండి గాని రాడు. ఇప్పుడు సీటిచ్చెయ్యండి!" అన్నాడు. "కుదర్దు. ఈ సాయంత్రం లోపల ఆయనొచ్చి సంతకం పెట్టేనే సీటు తెల్లారితే లేదు."... "సరే." వీరుడు సర్రన బయటి కెళ్ళాడు. మూడు నిమిషాల్లో రిప్లయి కార్డులాగా లోపలికొచ్చేశాడు. వాడితో ఇంకో పెద్దా డున్నాడు వాడన్నాడు : "ఏంటి, సార్, మా పార్టీవాడికి సీటు లేదన్నారంట. నేను జిల్లా సంఘం లీడర్ని మనం మనం కాంప్రమైజేషనైపోయి ఎడ్జస్టమెంటవ్వాలి. ఇప్పుడు సీటిచ్చెయ్యండి. ఆడి బాబును తర్వాత మీ దగ్గరికి నేను తీసుకొస్తాలెండి!"

ప్రిన్సిపాల్ మొహంలో కోపం తొంగి చూసింది. " నువ్వే పార్టీవాడివో నా కనవసరం. పేరెంటు సంతకం లేందే నేను సీటీవ్వకూడదు. ఫస్ట్ యు వేకేట్!"... ఆ పెద్ద కుర్రాడు రెచ్చిపోయాడు. "జిల్లా లీడర్ని... నన్ను అగౌరవ పరుస్తున్నారు, మాష్టారూ! సమయం రాకపో ద్సార్!.... మిమ్మల్ని డాష్ డాష్ చేసి తీరకపోతే చూడండి!" పక్కనున్న ఫిజిక్స్ లెక్చరర్ అన్నాడు : "నువ్వు డాట్ డాట్ అవ్వకుండా చూసుకో చాలు... పోరంబోకులాగా ఊరిమీద పడ్డావు.... నీ బాబు ఊర్లో లేడేంట్రా, సన్నాసీ! మర్యాదగా అవతలకి పోతావా, నేను చేసేది నన్ను చెయ్యమన్నావా?".... వాడు నివ్వెరపోయాడు. వీరుడితో లోగొంతుకతో - "ఈ సుత్తిగాడున్నాడని చెప్పలేదేంట్రా, పద, పద!"..... "అంతేనా!" అన్నాడు-ఏడుపు మొఖంతో వీరుడు. ఇద్దరూ బయటి కెళ్ళిపోయారు.

★★★

నారదుడు పనిమీద పక్క రూమ్ కెళ్ళటం చూసి ఒక వృద్ధుడు గుమ్మంలో జనాన్ని తోసుకుంటూ హఠాత్తుగా లోపలి కొచ్చాడు. ప్రిన్సిపాల్ చిరాకుపడ్డాడు : "నారదా! ఇంకా రాలేదా నువ్వు?' వృద్ధుడు చటుక్కున - "చిత్తం, రాలేదండి... అమ్మాయి రాకూడదండి.. నే నొచ్చాను." ప్రిన్సిపాల్, "అమ్మాయి రావటమేంటి?.... క్యూలోనే వచ్చారా మీరు?" అన్నాడు...."ఆఁ, ఆఁ, చెప్పండి... ఎంత కట్టాలి?" ప్రిన్సిపాల్ తన కళ్ళజోడు తీసి తీక్షణంగా చూస్తు అన్నాడు : "ఏం చెప్పటం!.... క్యూ, క్యూ!"

"అదే... డ్యూ... ఎంతో చెబితే వెంటనే కడతా!"... "డ్యూ కాదండీ, బాబూ, క్యూ! క్యూలో

రండి పిలిచాక రండి!'' అరిచాడు ప్రిన్సిపాల్ వృద్ధుడు అర్థంకానట్టు పక్కవాణ్ణి - 'ఏంటంటా డీయన?' అన్నట్టు చేత్తో ప్రశ్నించాడు అతను - 'బయటికెళ్ళి ఈ వరసలో రండి' అని చేత్తోనే సంజ్ఞ చేశాడు. 'రేపు, ఇదే టైముకి రమ్మంటారా . మహాప్రభో! మళ్ళీ రాలేను, ప్రిన్సిపాల్ గారూ! కీళ్ళనొప్పులవాణ్ణి. పైగా నేను షష్టిపూర్తి జరుపుకుంటున్నాను ఇప్పుడే ఇచ్చెయండి, బాబూ!'' అన్నాడు వృద్ధుడు.

సూపర్నెంటు కల్పించుకున్నాడు : "సార్! ఈ చెవిటాయన్తో మనకి టైమ్ వేస్టు. అప్లికేషను తియ్యమంటారా?" అన్నాడు. "తియ్యండి.''.. సూపర్నెంటు అప్లికేషను తీసిచ్చాడు. ప్రిన్సిపాల్ 'అడ్మిట్' ఆర్డర్ వేసి మళ్ళీ సూపర్నెంటు కిచ్చి, వదిలించుకున్నట్టు తలొంచి వృద్ధుడికి నమస్కరించాడు. వృద్ధుడు తన చెయ్యెత్తి, "ఆయురారోగ్యమస్తు! పుత్రపౌత్రాభివృద్ధిరస్తు! సకల కళావాప్తిరస్తు! ఆచంద్రార్కం-ధన కనక-వస్తువాహన-వాలేకూప తటాక- వసతి గృహ-వన విపిన-దేవా దేవ మాతృక-వ్యావసాయక భూమ్యాది...''

ప్రిన్సిపాల్- "చాల్చాలు, మహాప్రభో" అంటూ మళ్ళీ నమస్కరించాడు. అప్పుడే లోపలి కొచ్చిన నారదుడు, ప్రిన్సిపాల్ సైగతో ఆ ముసలాయన్ని బయటికి నడిపించుకెళ్ళాడు.

★★★

మరికొన్ని అడ్మిషన్లయ్యాయి. ప్యాన్లు తోసుకుంటూ లోపలికి ఒక కుర్రా డొచ్చి ప్రిన్సిపాల్ చేతికి కాగితం ఇచ్చాడు. "ఏంటిది!.... హాస్టల్ సీటుకి అప్లికేషనా! ।... ఏ క్లాసులో చేరావు?".... అన్నాడు ప్రిన్సిపాల్.

"కామర్స్, సార్!".... "ఏంటి.... కామర్సా! అందులో మే మింకా సెలక్షన్ బోర్డే పెట్టలేదే!"..... "అయ, ఆయ, అది కాద్సార్!... అప్లికేషను.... మీకు... నేనిచ్చాన్సార్!''.... "అప్లికేషన్ నువ్వు మాకిచ్చావు. నీకు సీటింకా మే మివ్వలేదు. నువ్వింకా కాలేజీలోనే చేరలేదు. అసలు సెలక్షన్లే అవ్వలేదు... ఈ విషయం నాకు తెలీకుండా హాస్టల్లో చేరిపోదామని ప్రయత్నం - అవునా? కళ్ళురిమాడు ప్రిన్సిపాల్. కుర్రాడు భయపడ్డాడు. "అది కాద్సార్... హాస్టల్లో సీట్లయిపోతాయని...''.. .. "ఎందుకయిపోతాయి?... ఈ ఏడాది సీట్లు పెరిగాయి. నీకు తెలీకుండానే ఉందా?... నిజం చెప్పు!''..... "మరండి....మా కజిన్ సిస్టర్... హాస్టలుకు దగ్గర్లో... రూమ్‌లో చేరిందండి!..... ఆమెను కనిపెట్టుకు నుండాల్సార్.''

"అదీ సంగతి! వాటంగా హాస్టల్ పక్కనే ఓ గదిలో చేరింది నీ గర్ల్! ఆ పక్కనే ఉండాలన్నది నీ కోరిక... ప్రభుత్వ నీకు హాస్టల్ వసతి కల్పిస్తున్నది బాగా చదువుకోటానికా, గంట గంటకీ గర్ల్‌ఫ్రెండుని గమనించుకుంటూ కాలం గడిపెయ్యటానికా!.... నువ్విప్పుడు నన్ను మోసం చెయ్యాలని ప్రయత్నించావు..... సరే, ఇదిగో నా సంతకం'' అంటూ ప్రిన్సిపాల్ ఆ అప్లికేషను మీద 'డిసీట్‌ఫుల్, గర్ల్ మైండెడ్, నాటెట్ ఎల్లాటెడ్ ఏ సీట్ ఇన్ ది కాలేజ్' అని రాసిచ్చి, "వెళ్ళి వార్డెన్‌కు చూపించు పో!' అన్నాడు. ఏడుపు ముఖంతో ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

★★★

"అచ్చారావ్, అచ్చారావ్!'' నారదుడు కేకేశాడు. ఆ అచ్చారావు లోపల కొచ్చాడు. ప్రిన్సిపాల్ అన్నాడు "గార్డియన్ సంతకం పెట్టించావు, తండ్రి లేడా?''.. "మా ఫాదర్ డెడ్ అండి. అందుకని

గార్డియన్‌గారిచేత పెట్టించానండి" - "ఎవరి గార్డియన్? ఆయనేడి?" ... "మా బాబాయి గారండి జడ్జి!"

ప్రిన్సిపాల్ అయోమయంగా చూశాడు "జడ్జా!... మనూళ్ళో జడ్జీగారా!"

"అవున్సార్" - ఇట్లా అని చేతులు కట్టుకుని నుంచున్నాడు అచ్చారావు

తికమక తొంగిచూడగా ప్రిన్సిపాల్ అన్నాడు - "మరి చెప్పవేంటయ్యా! ఆయన చాలా మంచివాడు... నాకు కనీసం ఫోనయినా చెయ్యలేదేంటి నీ విషయం! సర్లే, నీ కెప్పుడే మొహమాట పడకు... అన్నట్టు ఆయన ఆఫీసు ముద్ర లేదేంటి!... మిస్సయ్యా దేమో!"

"యస్సార్!"

"సరే, వెళ్ళు!" - ప్రిన్సిపాల్ అడ్మిట్ ఆర్డర్ వేసేసి, సూపర్నెంటు కిచ్చాడు అప్లికేషన్ని

అచ్చారావు వెళ్ళిపోయాడు. ఇంకో అరడజను మంది కుర్రాళ్ళొచ్చి వెళ్ళాక సూపర్నెంటు పిలిచాడు - "జె. పొగపొయ్యి, జె. పొగపొయ్యి!"

ఆ కుర్రాడు లోపలికొచ్చాడు. సూపర్నెంటు - "నీ పేరేమిటి?" అన్నాడు

"జె. పొగ పొయ్యండి."

"ఇంటి పేరేంటి."

"పొగపొయ్యి."

"అసలు పేరు?"

"జడ్జి"

"జడ్జా!" - విస్తుపోతూ సూపర్నెంటు ప్రిన్సిపాల్‌నీ, లెక్చరర్‌నూ చూశాడు. చివరికి కుర్రాడివైపు తిరిగి అన్నాడు : "మరిక్కడ ముందుది వెనక రాశావేంటి? మొదట్లోనే పొగ బెట్టేట్టున్నావు చూడబోతే!"

ప్రిన్సిపాల్ ఆ కుర్రాడి అప్లికేషను తిరగేశాడు. "ఫాదర్ లేడా? గార్డియన్నా!... గార్డియన్ లేకుండా అడ్మిట్ చేసుకోను వెళ్ళు!"

"ఇప్పుడొచ్చాడు గద్సార్, నా గార్డియన్ను!"

"ఎవరూ?"

"అచ్చారావు, సర్!"

తెల్లబోయారు అందరూ! ప్రిన్సిపాల్ అన్నాడు : "నీకు అచ్చారావు గార్డియన్నా! అయితే అచ్చారావుకు గార్డియన్నెవరు!"

"నేనే, సార్"

"వ్వాట్! ఆ జడ్జివి నువ్వా!... వాడికి నువ్వూ, నీకు వాడూ గార్డియన్నా! నీకు నువ్వే ఓ గార్డియన్ను తెచ్చుకోవాల్సుంటే నువ్వింకోడికి గార్డియన్‌వా? బుర్రా, బుద్ధీ లేదేంటి!... అసలు నీ బాబు నిజంగా చచ్చాడా, నువ్వు చంపేశావా కాగితం మీద!... చూడబోతే నీ తండ్రీ, నువ్వూ కలిసి ఈ నాటకం ఆడారనిపిస్తోంది... రాస్కెల్! నీకూ, నీ గార్డియన్‌కూ సీట్లు కాన్సిల్డ్! పొండి"

జట్టీ కాస్సేపు దురదుర చూసి విసురుగా బయటికెళ్ళిపోయాడు ప్రిన్సిపాల్ తలపట్టుకున్నాడు.

★★★

"భూలోక సుందరీ, భూలోక సుందరీ!" అరిచాడు నారదుడు.

సన్నగా, నల్లగా, పొట్టిగా, పీలగా ఉండి, చప్పిడి ముక్కు, దాకనోరుతో ఉన్న అమ్మాయి తన తల్లితో లోపలి కొచ్చింది

ప్రిన్సిపాల్ ఆ అమ్మాయి అప్లికేషన్ పరిశీలించాడు. అన్నాడు : "ఇన్‌కమ్ సర్టిఫికెట్ పెట్టావు బాగానే ఉంది. కానీ, తండ్రి సంతకం అప్లికేషనులో ఒకరకంగానూ. సర్టిఫికెట్‌లో ఇంకో రకంగానూ ఉందేంటి?"

భూలోకసుందరి అంది :"మా అయ్యకి ఆరోగ్యం బాగానేదండి. ఎప్పుడూ జొరం వొత్తా ఉంటుంది. జొరం లేనప్పటి సంతకవూ, జొరం ఉన్నప్పటి సంతకవూ కొంచెం యేరుగా వుంటాయండి."

"వీల్లేదు రెండూ సరిపోతేనే కాగితాలు చెల్లతాయి."

చటుక్కున తల్లి అందుకుంది : "బాబ్బాబూ రచ్చించండి. ఆడిసయం నేను సెబుతానండి... ఆడు పూటు తాగుమోతోడు, బాబో! ఆడి మాట్లూ, ఆడి పన్లూ కలవ్వు. ఎట్టాగొట్టా ఈ బొట్టిని కూసోబెట్టెయ్యండి, బాబయ్యా!"

"కాలేజీ సీటంటే ఆషామాషీ అనుకున్నావా.. ఎట్లా అడిగినా ఇచ్చెయ్యటానికి! తాగుబోతని తెలిసి సంతకాలెట్టా పెట్టించావ్?.... రిజర్వేషన్లో మీ అమ్మాయి కెనకాల ఎంతో మంది పడిగాపులు కాస్తున్నారు తెలుసా?"

చటుక్కున తల్లి కిందికి వాలిపోయి ప్రిన్సిపాల్ కాళ్ళు పట్టుకుని అంది : "రక్షించండి, బాబో, దిక్కులేని ముండని! - ఈ బొట్టే నా కాదారం. నా మీద మట్టి ఇదే ఎయ్యాల! సచ్చి మీ కడుపున పుడతాను, బాబయ్యా!" - హఠాత్తుగా ఏడుపు మొదలు పెట్టింది.

ప్రిన్సిపాల్ ఒక్క క్షణం ఆలోచించాడు "అయితే నీ తండ్రి పెట్టిన చోట మీ అమ్మచేత పెట్టించు.'

భూలోకసుందరి అప్లికేషను అందుకుంది. తల్లిచేత సంతకాలు చేయించింది. ఆడ్మిషన్ ఆర్డర్ అయ్యాక, "వెళ్ళొచ్చు" అన్నాడు ప్రిన్సిపాల్. తల్లి వెనక్కి తిరిగింది. గుమ్మం వైపు నడుస్తూ ఆవేశంగా అంది: "నీ జిమ్మడ, నీ మొదలార, నీ తలపాండు పగల, నీ గొయ్యి తియ్య, నిన్ను పాతియ్య, నిన్ను గెద్దలకెయ్య..." చటుక్కున నారదుడు చెయ్యి అడ్డు పెట్టాడు "ఏయ్! ఉపకారం చేసిన అయ్యగార్ని తిడుతున్నావా! ఒళ్ళు బలిసిందా?" అన్నాడు."అయ్యగార్ని కాదు, బాబే నా మొగసచ్చినోణ్ణి! యెదవ కొడుకుని!.. బాబ్బాబే!" తల్లీకూతుళ్ళిద్దరూ నిష్క్రమించారు "వీళ్ళతో అరవలేక నా గొంతు పోతోందండీ" అన్నారు ప్రిన్సిపాల్.

★★★

నారదుడు ఒక విజిటింగ్ కార్డు తెచ్చి ప్రిన్సిపాల్ కిచ్చాడు. ప్రిన్సిపాల్, "పంపించు" అన్నాడు. ఆ పెద్దమనిషి ఒక కుర్రాడిని వెంటబెట్టుకుని లోపల కొచ్చాడు

"నమస్తే, సార్!"

"నమస్తే చెప్పండి."

"ఎమ్.పి.సి. లిస్టులో మావాడిది ఆఖరి పేరు. ఇందాక నొస్తే సీటులేదు, ఆగాలన్నార్ట. లిస్టులో కెక్కాక సీటులేక పోవటమేంటండీ!"

కెమిస్ట్రీ లెక్చరరు అన్నాడు : "మరి మీ రిప్పుడొస్తే ఎట్లా? లిస్టు కట్టాం, మూడ్రోజులు టైమిచ్చాం. ఇవ్వాల మూడోరోజు. ఇప్పటిదాకా చూశాం, ఇంకోడి కిచ్చేశాం!"... "ఒక్క గంట ఆలస్యమైతే సీటు పోవటమే!.... దారుణం!.... పోన్లెండి. ఆ ఇచ్చిన కుర్రాడు మా ఊరివాడే. వాడిపేరు లిస్టులో లేదే.... వాడికెట్లా ఇచ్చారు?"

ప్రిన్సిపాల్ మాట్లాడలేదు.

తగ్గుస్వరంతో అనునయిస్తున్నట్లు సూపర్నెంటన్నాడు : "మాస్టారూ! చిన్న పొరపాటు జిగింది. ఆ కుర్రాడు అప్లికేషనుతో జత చేసిన మార్కుల లిస్టులు రెండూ చూసి వాడు తప్పి పాసయిన వాడేమోననుకున్నాం పొరబాటున. కనక ఈ ఫస్టు లిస్టులోకి వాడి పేరు ఎక్కలేదు. అవ్వేవో ఇంకో రాష్ట్రం మార్కుల్ట, అవ్వి రెండు కాగితాల మీద ఉన్నాయి. ఆ పొరపాటు మేం చేసుండకపోతే వాడికి మేం పదో రాంకు సీటివ్వాలి. ఆ పొరపాటును ఇప్పుడు దిద్దుకున్నాం."

ఊపుగా అన్నాడు ఆ పెద్దమనిషి : "అంటే మీ పొరబాటుకు మా వాణ్ణి బలిచేశారన్నమాట! ఇదంతా అనవసరం. మా వాడి కిప్పుడు సీటిస్తారా, నన్ను ప్రొసీడ్ అవ్వమంటారా?"... కెమిస్ట్రీ లెక్చరరు కల్పించుకున్నాడు. "ప్రొసీడవ్వడం మీకు సరదా అనుకుంటాను. వృత్తికూడానా?"

చటుక్కున సూపర్నెంటన్నాడు : "కొంచెం ఓపిక పట్టండి. మీకు సీటు రాకపోదు."

ఆ పెద్ద మనిషిలో ఆవేశం తగ్గింది- "ఎట్లా?"... "మా మేనల్లుణ్ణి చేర్చాను. వాడి ఫాదర్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ సీటు ఖాళీలో మీవాడిని చేర్చుకుంటాం. అదీకాక సెకండు లిస్టు రెండు మూడు రోజుల్లో కడతాం. అందులో ష్యూర్. అసలు వారం రోజు లాగితే చాలా సీట్లు ఖాళీ అవుతాయి."

"ఎప్పుడు చేరాడు మీ వాడు?"

"మొన్న."

"పేరు?"-పెన్నూ, కాగితమూ తీస్తూ అడిగాడు అతను.

"నాగులు."

"ఇంటిపేరు?"

"కె.-"

"ఏ సెక్షను?"

"ఏ- సెక్షను."

"ఏ రంగు?"

"ఎరుపు."

"పొట్టా, పొడుగా?"

"పొడుగు"

"సైకిలా, స్కూటరా?"

కెమిస్ట్రీ లెక్చరర్ కల్పించుకున్నాడు : "ఆ తండ్రి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ కాపీనీ, తాను వెళ్ళిపోతానని ఆయన రాసిచ్చిన హామీని కూడా తెచ్చిమ్మంటారా .. లేకపోతే ఏంటండీ, సెకండు లిస్టులో ఇస్తామని ఇంతమందిమి చెబుతున్నా నమ్మరన్న మాట!"

"నా అదుర్దా మీ కర్థమయ్యేది కాద్సార్!". "ఇంత అదుర్దా చూపించిన వాళ్ళే ఏదో సాకు చెప్పి మూడోనాడు టీ సీ తీసికెళ్ళిపోతున్నారు. గవర్నమెంటు కాలేజి అంటే అంత చులకనయింది మరి, ఎంత ఎఫిషియంట్ స్టాఫ్ ఉన్నప్పటికీ!"

"సర్లెండి, ఎప్పుడు కనిపించమంటారు."

ప్రిన్సిపాల్ అన్నాడు : "ఎల్లుండి కన్పించండి - మీ వాణ్ణి తప్పక చేర్చుకుంటాం."

అతను వెళ్ళి పోయాడు.

అయితే పావుగంట తరవాత నారదుడు నవ్వుకొంటూ లోపలికొచ్చి, "సార్! ఆయన క్లాసు రూములన్నీ వెతుక్కుంటూ వెళ్ళి సూపర్నెంటు గారబ్బాయితో - 'మీ రెప్పుడెడతారు-లారీయా, రాందాసా? ఇల్లు చూసుకున్నారా' - ఇట్లా అడుగుతున్నాడండి" అన్నాడు. "ఇది ఖచ్చితంగా మూణ్ణాళ్ళుండి లేచిపోయే కేసే" అన్నాడు కెమిస్ట్రీ లెక్చరరు. నిట్టూర్చాడు ప్రిన్సిపాల్.

అప్లికేషను పరిశీలిస్తూ ప్రిన్సిపాల్ అన్నాడు : "నీ పేరు మాధురా! . ఈ కాలేజీలోనే చదివావా! మరి సబ్జెక్టు జ్ఞాపకం ఉందా? డిగ్రీ అంటే సినిమాకెళ్ళటం కాదుమరి". "జ్ఞాపకం ఉందండి. నావి ఫస్ట్‌కాస్ మార్కులండీ!". "చూశాను. చూసే అడుగుతున్నాను. నాలుగేళ్ళ గాప్ ఎందుకిచ్చావు? పెళ్ళయిందా?" మాధురి చీటీ ఒకటి అందిచ్చింది. "ఏంటిది . బాంకు రశీదా! అడ్మిట్ ఆర్డర్ లేకుండా డబ్బెందుకట్టావు? ఒకవేళ సీటురాకపోతే ఏం చేసేదానివి? మీరు మాయకులో, అమాయకులో అర్థం కాదు."

"ఎట్లాగూ సీటిస్తారు గదా, ఆలస్యం లేకుండా అటెండెన్సు పలకొచ్చునని కట్టేశానండి, క్షమించండి. కూలికెడుతూ మానాన్న మీక్కనిపించాడు గదండీ!" ప్రిన్సిపాల్ అడ్మిట్ ఆర్డర్ వేసేశాడు. అప్లికేషన్ను సూపర్నెంటు కివ్వబోతూ, ఎందుకో ఒకసారి మళ్ళీ దాని కాగితాలు తిరగేశాడు. మార్కుల జాబితా చూస్తూ ప్రసన్నంగా అన్నాడు. "అప్పటి ప్రిన్సిపాల్‌గారు నీకు జ్ఞాపకం ఉన్నారా?" "ఉన్నారండి . కానీ ఆయన సస్పెండయారు గదండి!". హఠాత్తుగా ప్రిన్సిపాల్ ముఖం పాలిపోయింది. నెమ్మదిగా అన్నాడు: "ఏంటీ! బాగా తెలిసే మాట్లాడుతున్నావా? ఈ సంతకం ఆయన్దేనా?" "అవునండి, ఆయన మా క్లాసుక్కూడా వచ్చేవారండి. పాపం ఆ తర్వాత ఆయన ఆత్మహత్య కూడా చేసుకున్నారండి." "ఆత్మహత్యా! శివ శివా!" ప్రిన్సిపాల్ తమాయించుకొని అన్నాడు. "సరే, ఆయన పక్కన నన్నెప్పుడైనా చూశావా?".... "చూళ్ళేదండీ! అసలు ఆయనకీ, మీకూ పోలికల్లేవండి."... ప్రిన్సిపాల్ తెలివి తెచ్చుకున్నాడు. మార్కుల జాబితాను నిశితంగా పరిశీలించాడు. పక్కకి వంగి సూపర్నెంటుకూ, లెక్చరర్‌కూ చూపించాడు. చటుక్కున ఫోనెత్తి అవతలి గదిలోని యు డి సి ని రిజిస్టరు తీసుకురమ్మని పిలిచాడు.

మాధురి కంగారుపడింది. క్రమంగా ఆ అమ్మాయి ముఖంలో భయం చోటుచేసుకుంది. యు.డి.సి. రిజిస్టరు తెచ్చేప్పటికి ఆ అమ్మాయికి ముఖంలో ముచ్చెమటలు మెదటయ్యాయి. "మా ఫాదర్‌ను తీసుకొస్తానండి" అంది. ప్రిన్సిపాల్, "ఆగాగు. ఆ బల్లమీద కూర్చో. నీ సీటు విషయమే ఆలోచిస్తున్నాను" అన్నాడు. మాధురి ఆగలేదు. గుమ్మంలో నారదుణ్ణీ, జనాన్నీ తోసుకుంటూ ఇంచుమించు పరిగెత్తినట్టు బయటికెళ్ళిపోయింది.

రిజిస్టరు చూసి చూసి అయిదు నిముషాల తర్వాత ప్రిన్సిపాల్ తన వాళ్ళతో అన్నాడు : "ఇది దొంగ మార్కుల జాబితా! ఈ అమ్మాయి పేరు ఈ కాలేజీ రిజిష్టర్లోనే లేదు. ఈ జాబితా ఆధారంగా సీటిచ్చున్నట్టయితే నిజంగానే నేను సస్పెండయ్యుండేవాడిని... డెబ్భయి ఎనిమిదిలో ఇక్కడ పని చేసింది నేనే నని ఈ అమ్మాయికి తెలీదు. దీనికి తోడు, నా ముందు పని చేసినాయన చరిత్రని నా కంటగట్టి నన్ను సస్పెండు చేసి, చంపేసింది కాబట్టి నేను బతికాను... చూశారా, నా సంతకం అచ్చుగుద్దినట్టు ఎంత నీట్‌గా ఫోర్జరీ చేశారో దీనిమీద!"

అందరూ అవాక్కయ్యారు.

ప్రిన్సిపాల్ పోలీసులకి ఫోన్ చేశాడు. ప్యూన్ను పిలిచి ఆ అమ్మాయికోసం వెతకబోయే సరికి ఆ గ్రౌండు చుట్టుపక్కల ఎక్కడా లేకుండా మాయమయింది మాధురి!

"మై గాడ్! ఎంత గండం తప్పింది!" రుమాల్తో తుడుచుకున్నాడు ప్రిన్సిపాల్.

★★★

ఎమ్మెల్యే వచ్చాడు. అన్నాడు. "బి.ఎస్సి.-ఎమ్.పీ.సీ. గ్రూపు ఒక సెక్షన్‌తో సరిపెట్టేసార్ట ఏమిటి, సార్! ఇంకో సెక్షన్ తెరవటం చాలా అవసరం" అన్నాడు.

"గవర్నమెంటు శాంక్షన్ లేదండి" అన్నాడు ప్రిన్సిపాల్.

విసుక్కున్నాడు ఎమ్మెల్యే. "గవర్నమెంటెవ్వరండి.. మీరూ, నేనూను! మీ కెందుకు-ఎడ్మిట్ చేసుకోండి, నేనున్నాగా!"

"ఎకామడేషన్ లేదు, ఫర్నిచర్ లేదు, లెక్చరర్లు చాలరు. లాబ్స్ పరిస్థితి అంతంత మాత్రం. ఫైనాన్షియల్ కమిట్‌మెంట్‌కు డైరెక్టర్ ఒప్పుకోడు. అన్నీ తెలిసిన మీరే ఇట్లా అంటే ఎట్లా చెప్పండి?!"

"అన్నీ ఉంటే మీరు చేసేదేంటండీ! రేపు హైదరాబాద్ వెడుతున్నాను. ఏం రాస్తారో రాసి నా చేతి కివ్వండి. ఇప్పుడు ఓ పదిమంది కుర్రాళ్ళు - మనోళ్ళే లెండి ఉన్నారు. వాళ్ళని అడ్మిట్ చేసుకోండి. తప్పదు. వస్తా." ఎమ్మెల్యే వెళ్ళిపోయాడు.

ప్రిన్సిపాల్ కుర్చీలో వెనక్కి వాలి శూన్యంలోకి చూస్తూండిపోయాడు. చూసి చూసి, నారదుణ్ణి మంచినీళ్ళు తెమ్మన్నాడు.

(ఆంధ్రప్రభసచిత్ర వారపత్రిక 22-8-84)

★★★ ★★★ ★★★